క్లుప్తంగా

సుంకరి ఇస్సాదారుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న సుంకరి ఇస్సాదారులు

చందుర్తి: సుంకరి ఇస్సాదారుల సమస్యను పరిష్కారించాలని రాష్ట్ర అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ మజీద్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం అన్ని మండలాలల్లోని గ్రామాల సుంకరి ఇస్సాదారుల యొక్క డాటాను సేకరించి ప్రభుత్వానికి రెవెన్యూ అధికారులు నివేదికను ప్రభుత్వానికి పంపించాలన్నారు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న వాటాబంధీ విధానాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నక్క పర్శరాములు, మండల శాఖ అధ్యక్షుడు కాపిల్ల స్వామి, అన్ని గ్రామాల ఇస్సాదారుల తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సమస్యలపై దృష్టిసారించండి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం కొత్తబస్టాండ్‌లో సమస్యలపై దృష్టి సారించాలని సీపీఐ నాయకులు కోరారు. పార్టీ ఆధ్వర్యంలో సిరిసిల్ల డిపో మేనేజర్ కార్యాలయంలో గురువారం వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. కొత్త బస్టాండ్‌కు సిద్దిపేట, హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు రావడం లేదని, బస్టాండ్‌లో కార్గో సేవలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బస్టాండ్‌లో మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, మంచికట్ల రమేష్, మంత్రి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బందులు



తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న నాయకులు

వీర్నపల్లి: ఇసుక ట్రాక్టర్లతో పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని మండల బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్జనపల్లి గ్రామంలో పాఠశాల ముందు నుంచి ఇసుక ట్రాక్టర్లు నడపడం వలన విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. తినే సమయంలో దుమ్ము ధూళి పడడంతో రోగాల బారిన పడుతున్నట్లు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లను పాఠశాల ముందు నుంచి కాకుండా వేరే దారి ద్వారా రవాణా చేయాలని అన్నారు. బీజేపీ నాయకులు శ్రీనివాస్, పీర్య, నాగరాజు, లక్పతి, మహేశ్ పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు గ్రహణం

- పాత అంచనాలతో పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ఆరేళ్లుగా దాటవేస్తున్న పాలకవర్గాలు
- శిథిలావస్థలో పంచాయతీ భవనాలు
- మౌలిక వసతులు లేక అవస్థలు



ఆశిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ దుస్థితి



శిథిలావస్థలో ఉన్న బండపల్లి జీపీ భవనం

చందుర్తి: శిథిలావస్థకు చేరుకున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరై ఆరేళ్ల గడుస్తున్న వాటిని నిర్మాణాలను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్ ధరలకు అనుగుణంగా అంచనా వ్యయాన్ని పెంచకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఏళ్ల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలోని సగానికి పైగా గ్రామపంచాయతీ భవనాలన్నీ ఇరుకు గదులతో పెచ్చులూడుతూ కూలిపోయే దశలో ఉన్నాయి. గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఐదు గ్రామపంచాయతీలకు నిధులు మంజూరు కాగా, వాటిలో రెండింటిని మాత్రమే పూర్తిచేయగా, మిగిలిన మూడు గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. అధికారులు, పాలకవర్గ సభ్యులు నిర్లక్ష్యం మూలంగా ఈ పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి

మండలంలో గతంలో 18 గ్రామపంచాయతీలుండగా, రుద్రంగి గ్రామాన్ని మండలంగా ప్రకటించారు. మూడేళ్ల క్రితం రెండు నూతన గ్రామపంచాయతీలను ఏర్పాటు చేశారు. దీంతో మండలంలో గ్రామపంచాయతీ సంఖ్య 19కి చేరకుంది. వీటిలో ఇప్పటికే సనుగుల, మూడపల్లి, జోగాపూర్ గ్రామపంచాయతీ భవనాలను నూతనంగా నిర్మాణం చేపట్టారు. మూడు మినహా మిగతా గ్రామపంచాయతీ భవనాలన్నీ మూడు దశాబ్దాల క్రితమే నిర్మించినవి. తిమ్మాపూర్, నర్సింగపూర్, మర్రిగడ్డ, ఎన్గల్, లింగంపేట, కట్టలింగంపేట, అనంతపల్లి, రామరావుపల్లె గ్రామపంచాయతీ భవనాలు శిథిలావస్థలో ఇరుకుగా కూడా ఉన్నాయి. కనీసం గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసుకునేందుకు స్థలం లేదు. కొత్తగా ఏర్పడ్డ దేవుని తండా గ్రామపంచాయతీని స్వశక్తి మహిళ భవనంలో, కొత్తపేట గ్రామపంచాయతీని పాఠశాల భవనంలో కొనసాగిస్తున్నారు.

వసతులు కరువు

మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన పంచాయతీ భవనాల్లో కనీస సౌకర్యాల లేకపోవడంతో ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు ఇబ్బంది పడుతున్నారు. వీటిలో బాతురూంలు, టాయిలెట్లు లేవు. ప్రతి రెండు మాసాలకు ఒకసారి నిర్వహించే గ్రామసభలకు స్థలం లేక ఆరు బయటనే నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మౌలిక వసతులతో కూడిన నూతన గ్రామపంచాయతీల నిర్మాణానికి నిధులు మంజూరి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

అంచనా వ్యయాన్ని పెంచితే..

ఉపాధి హామీ పథకంలో 2017లో మండలంలోని చందుర్తి, సనుగుల, మూడపల్లి, ఆశిరెడ్డిపల్లె, బండపల్లి గ్రామపంచాయతీలకు రూ.13 లక్షలు మంజూరయ్యాయి. వీటిలో సనుగుల, మూడపల్లి గ్రామపంచాయతీల నిర్మాణం పూర్తి చేశారు. ఆశిరెడ్డిపల్లె, చందుర్తి, బండపల్లి గ్రామపంచాయతీ భవన నిర్మాణాలకు కావాల్సిన స్థలం లేకపోవడంతో పాటు అంచనా వ్యయాన్ని పెంచారు. స్థలం లేదన్న సాకుతో చందుర్తి, బండపలి, ఆశిరెడ్డిపలెల్ గ్రామపంచాయతీ భవనాలకు స్థలం కేటాయించి, అ వంచనా వ్యయాన్ని పెంచితే వెంటనే నిర్మాణాలు ప్రారంభిస్తామన్న సర్పంచులంటున్నారు.

స్థలం సరిపడక



గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రెండు గుంటల స్థలాన్ని కొనుగోలు చేసినా, ఇరుకుగా ఉంటుందని గ్రామస్తులు అభ్యంతరం తెలుపడంతో నిలిచిపోయింది. ఐదు గుంటల స్థలాన్ని ప్రభుత్వం కేటాయిస్తే కార్యాలయం సరిపోతుంది. అధికారులు స్థలాన్ని కేటాయిస్తే భవనాన్ని నిర్మిస్తాం.

– న్యాత విజయజార్జ్, సర్పంచ్, బండపల్లి

పెరిగిన రేట్ల ప్రకారం కేటాయించాలి



ఎప్పుడో ఆరేళ్ల క్రితం అంచనాల వ్యయంతో భవన నిర్మాణాన్ని చేపట్టడం సాధ్యం కాదు. ప్రస్తుతం పెరిగిన సామగ్రి అనుగుణంగా అంచనా వ్యయాన్ని పెంచితే భవన నిర్మాణాన్ని చేపడుతాం. పాత ధరల ప్రకారం పనులు చేసేందుకు అసక్తిచూపకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు.

– అంచా సుమ, సర్పంచ్, ఆశిరెడ్డిపల్లె

నివేదిక పంపించాం



కొత్తగా ఏర్పడిన రెండు పంచాయతీలతో పాటు శిథిలావస్థలో ఉన్న వాటిపై జిల్లా అధికారులకు నివేదిక ఇచ్చాం. చాలా గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేక నిధులు మంజూరైనా పనులు చేయించలేకపోతున్నాం. గతంలో మంజూరైనా బండపల్లి, ఆశిరెడ్డిపల్లె, చందుర్తి భవన నిర్మాణాలకు అంచనా వ్యయాన్ని కొత్త ధరల ప్రకారం సవరించాలని నివేదించాం.

– పత్తి రవీందర్, ఎంపీడీవో, చందుర్తి

ఆయిల్ పామ్ సాగుపై దృష్టిపెట్టండి



మాట్లాడుతున్న ఏఈవో శ్రీధర్‌రెడ్డి

వీర్నపల్లి: రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేయాలని ఏఈవో శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఆయిల్ పామ్ తోటల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సు ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం అన్ని రకాలుగా సబ్సిడీ అందిస్తుందన్నారు. డ్రిప్ సబ్సిడీ ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం మీద రాయితీ అందిస్తుందని, అలాగే ఒక ఆయిల్ పామ్ మొక్కను కేవలం రాయితీ మీద రూ.20కే అందిస్తుంది. అలాగే నాలుగేళ్ల వరకు ప్రతి సంవత్సరము ఎకరాని రూ.4,200 పెట్టుబడి ప్రోత్సాహకం కింద రైతు అకౌంట్‌లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటి దినకర్, ఉపసర్పంచ్ రవి, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, సెస్ డైరెక్టర్ మల్లేశం, రైతుబంధు కోఆర్డినేటర్ శేఖర్, పంచాయితీ కార్యదర్శి పురుషోత్తం, ఆయిల్ పామ్ క్లస్టర్ ఆఫీసర్ అరవింద్, పాల్గొన్నారు.

స్వచ్ఛతపై కళాజాత



సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా గురువారం సిరిసిల్ల 25వ వార్డులో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. ఆటలు, పాటలతో స్వచ్ఛతపై ప్రజల్లో అవగాహన కల్పించారు. కౌన్సిలర్ కుడిక్యాల రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాకారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



పుస్తకాలను వితరణ చేస్తున్న తులసీదాస్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల పట్టణం సర్దార్‌నగర్‌కు చెందిన గెంట్యాల తులసీదాస్ 150 పుస్తకాలను గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్యకు అందించాడు. ఈ సందర్భంగా చైర్మన్ శంకరయ్య మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉపకరించే పుస్తకాల వితరణ ద్వారా జ్ఞాన సమాజం ఆవిర్భవిస్తుందన్నారు. సామాజిక సేవ, సమాచార చట్టం పరిరక్షణ కోసం పాటుపడిన తన కుమారుడు జయంత్‌కుమార్ జ్ఞాపకార్థం ఈ పుస్తకాలను గ్రంథాలయానికి అందిస్తున్నట్లు తులసీదాస్ తెలిపారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కమలాకర్, వెంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత వాహన తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ బి.ఉపేందర్

తంగళ్లపల్లి: తంగళ్లపల్లిలో గురువారం సిరిసిల్లరూరల్ సీఐ ఉపేందర్ ఆధ్వర్యంలో వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి వాహనాలకు నంబర్ ప్లేట్లు లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించి జరిమానా విధించారు. అలాగే డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎస్సై లక్ష్మారెడ్డి, ఏఎస్సై ముఖీద్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్ల గొల్లపల్లిలోని మూడుగుళ్ల వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించగా ముగ్గురి వ్యక్తులపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై కిషన్‌రావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామంలో రూరల్ ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేసి సరిగా లేని వాటికి జరిమానా విధించారు. దుకాణాలను తనిఖీలు చేసి, కొత్త వ్యక్తులు వస్తే వెంటనే సమాచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు.

సమాచారం

నేడు తంగళ్లపల్లి మండల సర్వసభ్య సమావేశం

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మార్కండేయ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి.లచ్చాలు తెలిపారు. మండలానికి చెందిన అన్ని గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

కొబ్బరికాయల వేలం పాట

ఇల్లంతకుంట: సంక్రాంతి సందర్భంగా మండలంలోని జంగంరెడ్డిపల్లి శ్రీరామలింగేశ్వర స్వామి వారి మూడు రోజుల జాతర ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఉదయం 11 గంటలకు కొబ్బరికాయలు, ప్రసాదాల వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సంఘాలు - ఎన్నికలు

మహరాజ్ యూత్ అసోసియేషన్ కార్యవర్గం

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులో మహరాజ్ యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లింగంపల్లి అశోక్, ఉపాధ్యక్షుడిగా మినుప విక్రమ్, కోశాధికారిగా బడుగు నాగరాజు, సలహాదారుడు బడుగ ప్రదీప్, కార్యదర్శి బడుగు ప్రశాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రజక సంఘం

కోనరావుపేట: మండలంలోని కొలనూర్ గ్రామ రజక సంఘం అధ్యక్షుడిగా సుద్దాల బాబు, ఉపాధ్యక్షుడిగా మారుపాక రాజు, ప్రధానకార్యదర్శిగా సుద్దాల శంకర్, కార్యదర్శిగా గంగిపల్లి మల్లయ్య, కోశాధికారిగా కొత్తకొండ పర్శయ్య, కార్యవర్గసభ్యులుగా కొత్తకొండ పెంటయ్య, లోకుర్తి చంద్రయ్య ఎన్నికయ్యారు.

శ్రీకృష్ణయాదవ సంఘం

కోనరావుపేట: మండలంలోని కొలనూర్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడిగా వీరబోయిన దేవేందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వీరబోయిన రవి, ప్రధానకార్యదర్శిగా దానవేని ఎల్లయ్య, కోశాధికారిగా సంబు ఎల్లయ్య, కురుమ కార్యవర్గసభ్యులుగా చీమల శంకర్, సామల శ్రీనివాస్, గంగుల వెంకటేశ్, వీరబోయిని దేవయ్య, కుల పెద్ద మనుషులుగా వీరబోయిని రాములు, సంబు ఎల్లయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రతి నెలా సాహిత్య సదస్సులు

సిరిసిల్లకల్చరల్: ప్రతి నెలలో ఒక రోజు క్రమం తప్పకుండా సాహిత్య సదస్సులు నిర్వహించాలని జిల్లా రచయితల సంఘం నిర్ణయించింది. గురువారం సమావేశమైన సంఘం ప్రతినిధులు పలు అంశాలపై చర్చించి తీర్మానించారు. ఇటీవలే మృతిచెందిన కవులు యెన్నం సత్యం, బూర రాజేశ్వరికి నివాళిగా సంస్మరణ సభ, ఉగాది రోజున కేంద్ర గ్రంథాలయంలో కవి సమ్మేళనం, పాల్గొన్న ప్రతి కవికి శాలువాతో సత్కారం, రూ.516 నగదుతో సత్కరించాలని తీర్మానించారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య, రచయితల సంఘం బాధ్యులు ఎలగొండ రవి, వాసరవేని పరశురాం, బూర దేవానందం, జూకంటి జగన్నాథం, జనపాల శంకరయ్య, వెంగల లక్ష్మణ్, కోడం నారాయణ చిటికెన్ కిరణ్ పాల్గొన్నారు.

జాతీయ మహాసభను విజయవంతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: ఈనెల 11న బెంగళూర్‌లో నిర్వహించే జాతీయ మహాసభకు జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానపురం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. రిజర్వేషన్ ఫలాలను మాదిగలు, ఉపకులాలకు వర్తించేలా వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా కమిటీలతో పార్టీని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.

చైనీస్ మాంజా దారం నిషేధం

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలో ప్లాస్టిక్ దారం(చైనీస్) మాంజా విక్రయాలు నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి సందర్భంగా పతంగులు ఎగుర వేసేందుకు మాంజా దారాన్ని దుకాణదారులు అమ్మకాలు జరిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు.

మురిపించి.. మున్సిపల్‌లో కలిపారు

- విలీన గ్రామాలను పట్టించుకోని అధికారులు, పాలకులు
- పురపాలక తీరుపై విసుగెత్తుతున్న ప్రజలు
- జీపీలుగా మార్చాలని ఐక్య వేదిక సభ్యులు డిమాండ్



గ్రామపంచాయతీలుగా మర్చాలని ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన (ఫైల్)

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపాల్టీలో సమీప గ్రామాలను వీలినం చేస్తే మెరుగైన వసతులు కల్పిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలతో నాడు ఏడు గ్రామాలను మున్సిపల్‌లో విలీనం చేశారు. నాటి నుండి నేటి వరకు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. కనీస మౌలిక వసతులు కల్పించకుండా, పన్నులు భారం మోపుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ పాలనపై విసుగు చెందిన ప్రజలు వీలిన గ్రామాల ఐక్య వేదిక కమిటీ ఆధ్వర్యంలో పలు పోరాటాలు చేస్తున్నారు. పలుమార్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన సెస్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన వ్యక్తికి చుక్కలు చూపించారు. ప్రతి గ్రామంలో అధికార పార్టీపై వ్యతిరేకత ఏర్పడిందని విమర్శలకు తావిచ్చింది. మున్సిపల్ వద్దు–గ్రామపంచాయతీలు ముద్దు అని చీటీలు రాసి బ్యాలెట్ బాక్సుల్లో వేశారు. దీంతో అధికార పార్టీకి నాయకులు దగ్గరవుతున్నా, ప్రజలు మాత్రం దూరమవుతున్నారనే సందేహం కలుగుతోంది.

మున్సిపల్‌లో వద్దంటూ పోరాటాలు

విలీనమై ఏళ్లు గడుస్తున్న అభివృద్ధిలో ఎలాంటి మార్పులు లేకపోవడంతో గ్రామస్తులు మున్సిపల్ పాలనపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. గ్రామస్తులు విలీన గ్రామ ఐక్య వేదిక కమిటీని ఏర్పాటు చేసుకొని గ్రామపంచాయతీలుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే విడుతల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన వ్యక్తికి వ్యతిరేకంగా ఓట్లు వేసి తమ నిరసనను ప్రదర్శించారు. బ్యాలెట్ బాక్స్‌లో మున్సిపల్ వద్దు గ్రామపంచాయతీలు ముద్దు అని రాసి ఉన్న చీటిలు వేశారు. ఏడు గ్రామల్లో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థికి చుక్కెదురైంది. తమ గ్రామాలను తిరిగి గ్రామపంచాయతీలుగా మార్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హెచ్చరించినట్లు సమాచారం

పన్నుల భారం పెరిగింది



మున్సిపల్‌లో కలిపిన తరువాత అభివృద్ధి లేదు. కానీ పన్నులు పెంచుతున్నారు. మున్సిపాలనలో మెరుగైన వసతులు కల్పిస్తారనుకుంటే, అన్ని విధాలుగా దోచుకుంటున్నారు. కూలీలకు ఉపాధి కరువైంది

– ఆదిపెల్లి శ్రీనివాస్‌గౌడ్, పెద్దూరు

జీపీలుగా మారితేనే అభివృద్ధి



మున్సిపల్ పాలనలో మా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామాలు జీపీలుగా మారితేనే అభివృద్ధికి నోచుకుంటాయి. అధికారులు గ్రామాల్లో పర్యటిస్తే సమస్యలు తెలుస్తాయి. మమ్మల్ని పట్టించుకునే నాధుడే లేరు. గ్రామపంచాయతీలుగా ఏర్పడే వరకు పోరాటం చేస్తాం.

– లింగంపల్లి మధుకర్, బోనాల

సంక్షిప్తంగా..

గ్రామస్థాయిలో బీజేపీ బలోపేతం

ముస్తాబాద్: గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతానికి కృషి చేయాలని పార్టీ జిల్లా ఇన్‌చార్జి మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామ గ్రామాన కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రచారం చేయాలని, టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. బీజేపీ నాయకులు కోలా కృష్ణగౌడ్, సంతోష్‌రెడ్డి, శ్రీనివాసరావు, మహేందర్, రమేశ్‌రెడ్డి, గోపి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో సమీక్ష

బోయినపల్లి: స్థానిక గ్రామపంచాయతీలో గతంలో ఎంపికై న డబుల్ బెడ్రూం లబ్ధిదారులతో తహసీల్దార్ దర్బెల్లి నరేశ్ గురువారం సమీక్ష నిర్వహించారు. సర్పంచ్ గుంటి లతశ్రీ, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీ గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం పలువురు లబ్ధిదారులకు సర్పంచ్ బైరి శ్రీవాణి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

చందుర్తి: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను ఎంపీపీ లావణ్య గురువారం ఆవిష్కరించారు.